నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 17 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బాలిక విద్యకు బాసట

- మంచిర్యాల జిల్లాలో ఐదు కేజీబీవీలు అప్‌గ్రేడ్
- వేమనపల్లి, దండేపల్లి, కన్నెపల్లి, కోటపల్లి, హాజీపూర్ కస్తూర్బాల్లో ఇంటర్ ప్రారంభం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు

నస్పూర్, మే 16 : ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద బాలికలకు కళాశాల విద్యను చేరువ చేస్తున్నది. జిల్లాలో కొత్తగా ఐదు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)ను అప్‌గ్రేడ్ చేయగా, ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ విద్య అమల్లోకి తీసుకువస్తున్నది. జిల్లాలో 18 కేజీబీవీలుండగా, ఇందులో పదింటిలో ఇంటర్ విద్య అమలవుతున్నది. ఈ ఏడాది వేమనపల్లి, కోటపల్లి, హాజీపూర్, దండేపల్లి, కన్నెపల్లి కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో గ్రూపులో 40 మందికి ప్రవేశం కల్పించనున్నది.

విద్యార్థినులకు మేలు

జిల్లాలో పది కేజీబీవీల్లో మాత్రమే ఇంటర్ విద్య కొనసాగుతుండగా, మిగతా ఎనిమిదింటిలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్నాయి. వీటిలో ఐదు కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రారంభించడంతో బాలిక విద్యకు భరోసా కలుగుతోంది. అనాథలు, వెనకబడిన వర్గాలకు సీట్లు కేటాయిస్తారు. కేజీబీవీల్లో పదో తరగతి చదివిన వారికి మొదట ప్రాధాన్యం ఇస్తారు. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ప్రచారం చేపట్టారు.

రెండు చోట్ల రెండు.. మూడు చోట్ల ఒకే కోర్సు

జిల్లాలోని కేజీబీవీల్లో 4,589 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. అప్‌గ్రేడ్ అయిన ఐదు కేజీబీవీల్లో రెండు చోట్ల రెండు కోర్సులు, మిగితా మూడు చోట్ల ఒకే కోర్సు నిర్వహించనున్నారు. అదనపు తరగతి గదులు లేక, ఇతర కారణాల దృష్ట్యా ఒక్కో కోర్సుకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలుస్తున్నది. హాజీపూర్‌లో బైపీసీ, ఎంఎల్‌టీ, కోటపల్లిలో బైపీసీ, కన్నెపల్లిలో బైపీసీ, దండేపల్లిలో ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్స్, వేమనపల్లిలో ఎంఎల్‌టీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. భీమిని, కాసిపేట, భీమారం కేజీబీవీల్లో గదుల కొరత, సౌకర్యాల లేమి కారణంగా ఇంటర్ విద్య అమలుకు నోచుకోకుండా పోయాయి.

క్షయ రహిత సమాజాన్ని నెలకొల్పాలి

మంచిర్యాల జిల్లా వైద్యాధికారి సీతారాంనాయక్

అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి సీతారాంనాయక్

దహెగాం, మే16 : క్షయవ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి సీతారాంనాయక్ అన్నారు. శుక్రవారం దహెగాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌టీఈపీ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బందికి క్షయపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా వ్యాధి నిర్మూలన కోసం పూర్తి స్థాయిలో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలో వైద్యసిబ్బంది గ్రామాల్లో ఇంటింటా తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారన్నారు. పరీక్షలు నిర్వహించి వ్యాధి ఉన్నట్లు తేలితే ఉచితంగా మందులు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అశ్విని, హెచ్‌ఈవో కోటేశ్వర్, క్షయవ్యాధి సూపర్‌వైజర్ ఖాదర్ పాషా, పీహెచ్‌ఎన్ సావని, హెచ్‌వీ పద్మ,సీహెచ్‌వో వెంకన్న, ఫార్మసిస్టు రాంచద్రారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఐటీ హబ్ కోసం తీసుకుంటున్న వ్యవసాయ భూమి

వేంపల్లి శివారులోని పేదల భూముల్లో ఐటీ హబ్

భూ సేకరణ వివాదాస్పదం!

- 2013-చట్ట ప్రకారమే పరిహారమివ్వాలని కొందరు రైతుల డిమాండ్
- 2017-నిబంధనలను అనుసరించి నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు
- అలాగైతే నష్టపోతామంటూ పలువురి ఆవేదన

మంచిర్యాల, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం చేపడుతున్న భూసేకరణ వివాదాస్పదమవుతున్నది. 2017 చట్టాన్ని అనుసరించి నోటిఫికేషన్ వెలువరించగా, ఆ నిబంధనలు అమలు చేస్తే నష్టపోతామని, 2013-చట్ట ప్రకారమే పరిహారం చెల్లించాలని కొందరు రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా.. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా సుమారు 276.09 ఎకరాల భూమిని బలవంతంగా సంతకాలు తీసుకొని లాక్కుంటున్నారంటూ ఫిబ్రవరిలో కొందరు హైకోర్టును ఆశ్రయించగా, 2013 చట్ట ప్రకారమే పరిహారం ఇవ్వాలని కోర్టు సూచించిన విషయం విదితమే.

2017 నిబంధనల ప్రకారం నోటిఫికేషన్

భూసేకరణ ప్రక్రియ వివాదాస్పదం కావడం, ఆపై కోర్టు ఆదేశాలతో తెలంగాణ స్టేట్ ల్యాండ్ అక్విజిషన్ రూల్స్-2017 ప్రకారం గత నెలలో మంచిర్యాల కలెక్టర్ భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 212 ఎకరాలను సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ రిలీజ్ చేసిన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలో భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలుంటే నమోదు చేయాలని సూచించారు. మొదట్లో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే యజమానులతో బలవంతంగా సంతకాలు తీసుకున్నారని ఆరోపణలు రావడంతో అధికారులు తమ తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేసినట్టు స్పష్టమవుతోంది.

2013 యాక్ట్‌కు మంగళం

ప్రభుత్వ, ప్రైవేట్ అవసరాల కోసం ప్రజల భూములను సేకరించాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం సదరు ఏరియాలో గత మూడేండ్లలో జరిగిన లావాదేవీలను పరిగణనలోకి తీసుకొని నష్టపరిహారం నిర్ణయించాలి. దానికి మూడు రెట్లు పరిహారం, దానికి వంద శాతం సొలాటియం చెల్లించడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి. అయితే.. పరిహారం ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుందన్న కారణంగా గత బీఆర్ఎస్ సర్కారు 2017లో తెలంగాణ స్టేట్ ల్యాండ్ అక్విజిషన్ రూల్స్ తీసుకొచ్చింది. దీని ప్రకారమే మంచిర్యాలలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణ చేపడుతున్నారు. దీంతో తమకు తక్కువ పరిహారం వస్తుందని, 2013 చట్టాన్ని అమలు చేయాలని భూయజమానులు డిమాండ్ చేస్తున్నారు.

ఎకరానికి రూ.13.50 లక్షలే..

తెజీఐఐసీ ఆధ్వర్యంలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం 212 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, ఎకరానికి రూ.13.50 లక్షల నష్టపరిహారం నిర్ణయించారు. దీంతోపాటు భూ యజమానులకు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం150 గజాల ప్లాట్‌ను కేటాయించనున్నారు. వేంపల్లి శివారులోని సర్వేనంబర్లు 155, 156, 157, 158, 159, 160తో పాటు పోచంపాడ్ శివారులోని సర్వేనంబర్లు 1, 2, 8, 9, 10లలో అసైన్డ్, సీలింగ్, పట్టా భూములన్నింటికీ ఇదే పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ భూములు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ మార్కెట్ విలువ ఎకరానికి రూ.50 లక్షల పైనే ఉంది. దీంతో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసినట్లయితే తమకు న్యాయం జరుగుతుందని భూయజమానులు పేర్కొంటున్నారు. ఓవైపు తక్కువ నష్టపరిహారం చెల్లిస్తున్నారని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని భూయజమానులు కోరుతున్నారు. కానీ.. అధికారులు ఎకరానికి రూ. 13.50 లక్షల పరిహారం, 150 గజాల ప్లాట్ నిర్ణయించి డిక్లరేషన్లు తీసుకుంటున్నారు. కొంతమంది దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు అసైన్డ్ పట్టాలు లేవు. వీటిని ప్రభుత్వం వెన క్కు తీసుకుంటుందని భయపెట్టి ఎకరం రూ.13.50 లక్షల చొప్పున లీడర్లే కొంటున్నట్లు తెలుస్తోంది.

సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఉద్యోగోన్నతులతోనే గుర్తింపు

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల అర్బన్, మే 16 : ఉద్యోగోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్డ్ విభాగంలో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా ప్రమోషన్ రావడంతో వారిని అభినందించారు. వారికి ర్యాంక్.. ప్రమోషన్ చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. సీపీ మాట్లాడుతూ ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ దామోదర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక తోడాలి

నస్పూర్, మే 16 : జిల్లాలో నిబంధనల మేరకే ఇసుక తోడాలని, అందుకనుగుణంగా అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూరు మండల కేంద్రంలో ఇసుక తీసేందుకు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి నిబంధలకు లోబడి అనుమతులు జారీ చేస్తామన్నారు. దరఖాస్తులపై జిల్లా రెవెన్యూ, నీటి పారుదల, భూగర్భ జల, గ్రామీణ నీటి సరఫరా, మైన్స్, టీజీఎండీసీల శాఖల సమన్వయతో సమగ్ర విచారణ జరిపి అనుమతులు జారీ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరితో కలిసి విద్యాసంస్థల ప్రవేశాల పోస్టర్‌ను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, ప్రిన్సిపాల్‌లు సంధ్య, గోపి, సమ్మయ్య, నీలు పాల్గొన్నారు.

ఎల్లూరు ఫారెస్ట్‌లో పులి హతం ?

- గోప్యంగా ఉంచుతున్న అటవీశాఖ
- కాలిపోయిన టైగర్ కళేబరం లభ్యం!

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ) : కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికల్‌పేట్‌రేంజ్ పరిధిలోగల ఎల్లూరు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు పులిని హతమార్చినట్లు తెలుస్తున్నది. రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు ఆ ప్రాంత ప్రజలు చర్చించుకుంటుండగా, ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ బయటకు పొక్కకుండా అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. గతేడాది కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో కొంతమంది దుండగులు రెండు పులులపై విష ప్రయోగం చేసి హతమార్చిన ఘటన రాష్ట్రంలోనే సంచలనం రేపింది. తాజాగా.. ఎల్లూరు అటవీ ప్రాంతంలో దుండగులు పులిని హతమార్చినట్లు సమాచారముండగా, అటవీశాఖలో కలకలం రేపుతున్నది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో కొన్నేళ్లుగా పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ఈ క్రమంలో పులులను హతమార్చే ముఠాలు కూడా ఈ అటవీ ప్రాంతలలో సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పులుల సంరక్షణ కోసం అటవీ అధికారులు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రమే కాగా, ముఠాలు పులులను ట్రాక్ చేసి హత మారుస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై రెండు మూడు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశాలున్నాయి. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులకు శుక్రవారం పూర్తిగా కాలిపోయిన పులి కళేబరం లభ్యమైనట్లు తెలుస్తున్నది.

జోరువాన

- కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడ్డ జొన్న రైతులు
- తాంసిలో పిడుగుపడి రావి చెట్టు దగ్ధం
- పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసిలో పిడుగు పడి దగ్ధమవుతున్న రావి చెట్టు

ఇచ్చోడ మార్కెట్ యార్డులో జొన్నలపై టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు

వాంకిడి, మే 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో శుక్రవారం వర్షం దంచికొట్టింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకూ ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా భానుడు ప్రతాపం చూపగా, ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

ఇచ్చోడ మండలంలో..

ఇచ్చోడ, మే 16 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇచ్చోడ, సిరికొండ మండలాల యార్డుల్లో జొన్నలు విక్రయించడానికి వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. టార్పాలిన్ కవర్లు కప్పి ధాన్యం తడసిపోకుండా కాపాడుకున్నారు. సిరికొండలో శాశ్వత మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

భీంపూర్ మండలంలో..

తాంసి(భీంపూర్), మే 16 : భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి తదితర శివార్లలో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. అక్కడక్కడా జొన్నలను చేల నుంచి తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు.

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, మే16 : మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో శుక్రవారం రాత్రి 7గంటల నుంచి భారీ వర్షం మొదలైంది. పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

వాంకిడిలో కురుస్తున్న వర్షం

రావి చెట్టుపై పిడుగు.. తప్పిన ప్రమాదం

తాంసి, మే 16 : మండల కేంద్రంతోపాటు పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, గిరిగామ గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తాంసి మండల కేంద్రం సమీపంలోని పాఠశాల వెనకాల గల పంట చేనులో రావి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు ధాటికి రావి చెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఘనంగా అరిగెల పుట్టిన రోజు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 16 : బీజేపీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు సాయిని నరసింహాస్వామి ముక్త విలాస్, దీపక్, నాయకులు సుంకరి పెంటయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, ముషీర్, శ్రీకాంత్, ప్రసాద్ గౌడ్, రాథోడ్ వినోద్, సుగుణాకర్, నవీన్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

కోటపల్లి, మే 16 : కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు జరుగుతుండగా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది భక్తులు ఇందారం ఎక్స్ రోడ్డు నుంచి చెన్నూర్ మీదుగా 63వ జాతీయ రహదారి గుండా కాళేశ్వరం వెళ్తుంటారని, వారికి అసౌకర్యాలు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ సుధాకర్, దేవేందర్, ఎస్ఐ రాజేందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.